క్లుప్తంగా

అమ్మఒడి ద్వారా 4,256 మందికి రూ.5.53 కోట్ల లబ్ధి

ఉంగుటూరు: మండలంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న 4,256 మంది పిల్లల తల్లుల బ్యాంకు ఖాతాల్లో అమ్మఒడి పథకం ద్వారా బుధవారం రూ.5.53 కోట్లు జమ చేసినట్లు ఎంపీడీఓ శేషగిరిరావు తెలిపారు. విద్యార్థులు ప్రభుత్వ తోడ్పాటును సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ సూచించారు.

'పోషణ్ ట్రాకర్'పై అవగాహన

గన్నవరంరూరల్: మండలంలోని జక్కులనెక్కలం గ్రామంలో ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో బుధవారం కేసరపల్లి అంగన్‌వాడీ సెక్టార్ సమావేశం జరిగింది. రాష్ట్ర పోషణ్ ట్రాకర్ యాప్ కో-ఆర్డినేటర్ కె.మార్వి ముఖ్య అతిథిగా హాజరై పోషణ్ ట్రాకర్‌పై అంగన్‌వాడీ టీచర్‌లకు అవగాహన కల్పించారు. తల్లులు, బాలింతలకు నెలనెలా అందజేసే టీహెచ్‌ఆర్ పౌష్టికాహారం వివరాలను పోషణ్ ట్రాకర్‌లో నమోదు చేయాలన్నారు. ప్రీస్కూల్ కార్యక్రమాలు నిర్వహించి, వాటినీ అప్‌లోడ్ చేయాలన్నారు. ఏసీడీపీవో సీహెచ్ నాగపద్మావతి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రతిరోజు నిర్వహించే కార్యక్రమాలు వివరించారు.

ఉయ్యూరు విద్యార్థుల ప్రతిభ

ఉయ్యూరు: సాంస్కృతిక పోటీల్లో ఉయ్యూరు విద్యార్థులు ప్రతిభ చాటారు. ఇస్కాన్ టెంపుల్ ఆధ్వర్యంలో విజయవాడలో రాత్ ఫెస్ట్-2023 నిర్వహించారు. ఈ నెల 26న నిర్వహించిన ఈ ఫెస్ట్‌లో ఉయ్యూరుకు చెందిన కుంచెవరపు రాజీవవెంకట శ్రీసాయి వశిష్టలక్ష్మి, లక్ష్మిశెట్టి రాజ్యప్రియ, కోలా సూర్య కీ బోర్డు విభాగంలో పాల్గొని ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను కైవసం చేసుకున్నారు. విజేతలను, శిక్షణ ఇచ్చిన ధూళిపూడి శేషగిరిరావును ఏజీఅండ్ ఎస్‌జీ కళాశాల డైరెక్టర్ జీజీపీ వినయ్‌కుమార్ పలువురు ప్రముఖులు అభినందించారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

రామవరప్పాడు: మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని జువైనల్ జస్టిస్ బోర్డు సభ్యులు అన్నామణి మల్లోలు అన్నారు. ఎనికేపాడులోని విజయ మహిళా ఫార్మసీ కాలేజీలో బుధవారం రాష్ట్ర యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై అవగాహన సదస్సు నిర్వహించారు. అన్నామణి మాట్లాడుతూ మత్తు పదార్థాలకు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. జిల్లా యువజన సర్వీసుల శాఖ అసిస్టెంట్ మేనేజర్ నాగేశ్వరరావు, డీఅడిక్షన్ సెంటర్ నుంచి పతం భవాని, మానసిక వ్యక్తిత్వ వికాస నిపుణులు విజయ రత్నం, కళాశాల ప్రిన్సిపాల్ పద్మలత పాల్గొన్నారు.

వక్ఫ్ ఆస్తుల రక్షణకు చర్యలు

గన్నవరంరూరల్: మండలంలోని ముస్తాబాద ముస్తఫావలి దర్గా, మసీదు భూములు ఆక్రమణలకు గురికాకుండా వక్ఫ్ బోర్డు అధికారులు బుధవారం నోటీస్ బోర్డులు ఏర్పాటుచేశారు. వక్ఫ్ బోర్డు స్పెషలాఫీసర్ షిరీన్ బేగం, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఎల్.అబ్దుల్ ఖాదర్ ఆదేశాల మేరకు కృష్ణాజిల్లా వక్ఫ్ బోర్డు ఇన్‌స్పెక్టర్ షేక్ ఖాజా మస్తాన్ పర్యవేక్షణలో సిబ్బంది పది నోటీసు బోర్డులను దర్గా ఆస్తుల్లో ఏర్పాటు చేశారు. సర్వే నంబర్ 448లో 28.47 ఎకరాలు ఏపీ వక్ఫ్ బోర్డులో నమోదైనట్లు చెప్పారు.

అత్తింటివారిపై కేసు నమోదు

పెనమలూరు: కట్నం కోసం వేధిస్తున్న అత్తింటివారిపై పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. యనమలకుదురు ఇందిరానగర్‌కు చెందిన షేక్ ఆశా బేగం గత ఏడాది అదే ప్రాంతానికి చెందిన షేక్ రఫీని పెద్దల సమక్షంలో వివాహం చేసుకుంది. పెళ్లి సమయంలో ఇచ్చిన కట్నం చాలేదని, అదనపు కట్నం కావాలని భర్త రఫీ, అత్త నన్నే వేధింపులకు గురి చేయటంతో ఆశాబేగం పోలీసులకు ఫిర్యాదు చేసింది.

'జగనన్న సురక్ష'ను సమర్థంగా నిర్వహించాలి



తాడిగడపలో ప్రసంగిస్తున్న మునిసిపల్ కమిషనర్ ప్రకాశరావు



కోలవెన్ను అవగాహనా సదస్సులో సూచనలు ఇస్తున్న తహసీల్దార్ ప్రసాద్, పక్కన ఇన్‌చార్జి ఎంపీడీఓ ఉదయ్‌భాస్కర్

పెనమలూరు: జగనన్న సురక్ష కార్యక్రమాన్ని తాడిగడప మునిసిపాలిటీ పరిధిలో సమర్థవంతంగా నిర్వహించాలని మునిసిపల్ కమిషనర్ ఎస్.ప్రకాశరావు ఆదేశించారు. తాడిగడప కార్మికనగర్‌లో బుధవారం నాలుగు సచివాలయాల పరిధిలోని ఉద్యోగులు, వలంటీర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ప్రతి ఇంటికీ వెళ్లి సర్వే నిర్వహించి ప్రజల సమస్యలు తెలుసుకోని, ఆ వివరాలు నమోదు చేయాలని సూచించారు. నాయకులు జనార్దన్, వేమూరి బాలకృష్ణ పాల్గొన్నారు.

జగనన్న సురక్షపై అవగాహన

కంకిపాడు: జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సమర్థంగా అమలు చేయాలని తహసీల్దార్ ప్రసాద్, ఇన్‌చార్జి ఎంపీడీఓ ఉదయ్‌భాస్కర్ సూచించారు. కోలవెన్ను, నెప్పల్లి గ్రామాల్లో జగనన్న సురక్షపై బుధవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. తహసీల్దార్ ప్రసాద్, ఇన్‌చార్జి ఎంపీడీఓ ఉదయ్‌భాస్కర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా జూలై ఒకటో తేదీ నుంచి అన్ని సచివాలయాల్లో షెడ్యూలు ప్రకారం జగనన్న సురక్ష కార్యక్రమం జరుగుతుందన్నారు. ప్రజల సమస్యలను ఇంటింటి సర్వేలో గుర్తించి పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. కోలవెన్ను సభలో సర్పంచ్ సీహెచ్ సురేష్‌కుమార్, సగర కార్పొరేషన్ డైరెక్టర్ నక్కా శ్రీనివాసరావు, ఈఓపీఆర్డీ పి.వి.ఎస్.మైథిలి, మాజీ సర్పంచ్ టొక్కెం సతీష్‌కుమార్, ఎంపీటీసీ సభ్యులు తోకల ఉమాదేవి, ఈఓ శివకుమార్, నెప్పల్లి సదస్సులో స్థానిక నాయకులు కొణతం గిరిధర్, బత్తుల కామేశ్వరరావు, నర్రా రమేష్‌బాబు, గుజ్జుల కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష విజయవంతం చేయండి

నున్న(విజయవాడరూరల్): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని వలంటీర్లు, గృహసారథులు, సచివాలయ సిబ్బంది, అధికారులు విజయవంతం చేయాలని జెడ్పీటీసీ కె.సువర్ణరాజు అన్నారు. నున్న గ్రామంలో బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమంపై సమావేశం జరిగింది. సమావేశంలో మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ యర్కారెడ్డి నాగిరెడ్డి మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమంలో 11 రకాల సేవలను ప్రభుత్వం అందజేస్తుందన్నారు. గ్రామ సర్పంచి కాటూరి సరళ అధ్యక్షతన జరిగిన సమావేశంలో గన్నవరం మార్కెట్ కమిటీ చైర్మన్ ఆర్.అంజనీకుమారి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఆర్‌వీఆర్, ఉపసర్పంచి కలకోటి బ్రహ్మానందరెడ్డి, గ్రామ పార్టీ కన్వీనర్ పోలారెడ్డి చంద్రారెడ్డి, పలువురు పార్టీ నాయకులు, గృహసారథులు, వార్డుసభ్యులు, పంచాయతీ కార్యదర్శి జీటీవీ రమణ, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలు
ఉయ్యూరు ఆర్డీఓ విజయ్‌కుమార్



ఆకునూరు సచివాలయంలో జగనన్న సురక్షపై సమీక్ష చేస్తున్న ఆర్డీఓ విజయ్‌కుమార్

ఉయ్యూరు: ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలు అందించే లక్ష్యంతో ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమం చేపట్టిందని ఉయ్యూరు ఆర్డీఓ ఎస్.విజయ్‌కుమార్ తెలిపారు. మండలంలోని ఆకునూరు గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమం అమలును బుధవారం ఆయన పరిశీలించారు. సచివాలయంలో సిబ్బంది, వలంటీర్లతో కార్యక్రమం అమలు తీరుపై సమీక్ష చేశారు. విధిగా గృహాలను సందర్శించి లబ్ధిదారుల వివరాలను నమోదు చేసి సురక్షకార్యక్రమంలో పేర్కొన్న సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మస్తాన్, ఎంపీడీఓ విమాదేవి పాల్గొన్నారు.

సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహిస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

హనుమాన్‌జంక్షన్‌రూరల్: విద్యార్థులకు బంగారు భవిష్యత్ అందించాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న పథకాలు దేశీయ విద్యా వ్యవస్థలో విప్లవాత్మకమని బొమ్ములూరు సర్పంచ్ కాటూరు విజయభాస్కర్ అన్నారు. బాపులపాడు మండలం బొమ్ములూరులోని ఎంపీయూపీ పాఠశాలలో అమ్మ ఒడి నాల్గో విడత పంపిణీ సందర్భంగా బుధవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు సీఎం వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న చిన్నారుల భవిష్యత్ కోసం గతంలో ఏ ప్రభుత్వం ఇంతగా ఆలోచించలేదని సర్పంచ్ విజయభాస్కర్ అన్నారు. మనబడి నాడు-నేడు, జగనన్న విద్యా కానుక, అమ్మ ఒడి, జగనన్న గోరుముద్ద వంటి పథకాలతో ప్రభుత్వ బడులపై విశ్వాసం పెరిగిందన్నారు. ఉప సర్పంచ్ కంచి నాగలక్ష్మి, గ్రామ ప్రముఖులు కంచి నాగయ్య, మట్టా వీరబాబు, సచివాలయం కన్వీనర్ మాతంగి చంద్రిక పాల్గొన్నారు.

స్థల వివాదంపై దంపతుల ఆందోళన



స్థలం వద్ద ఆందోళన చేస్తున్న దంపతులు

గన్నవరం: అన్యాక్రాంతానికి గురైన తమ స్థలాన్ని కాపాడాలని కోరుతూ ఓ దంపతులు ఆందోళనకు దిగిన సంఘటన మండలంలోని కేసరపల్లిలో బుధవారం జరిగింది. గ్రామానికి చెందిన పల్లపోతు దుర్గాకళ్యాణి, ఆమె భర్త గంగరాజుతో కలిసి ప్లకార్డులు చేతపట్టుకుని సదరు స్థలం వద్ద నిరసనకు దిగారు. ఈ సందర్భంగా దుర్గాకళ్యాణి మాట్లాడుతూ తన తండ్రి నెరుసు వీరవెంకటేశ్వరరావుకు చెందిన వ్యాపార దుకాణాలు ఉన్న 94 చదరపు గజాల స్థలాన్ని 2017 తాము కొనుగోలు చేసినట్లు తెలిపారు. అయితే సదరు స్థలాన్ని 2022లో తన తండ్రి వేరే వ్యక్తికి విక్రయించినట్లు దస్తావేజులు పుట్టించారని దుర్గాకళ్యాణి ఆరోపించారు. దీనిపై తాము కోర్టును ఆశ్రయించగా కోర్టు స్టేటస్‌కో ఇచ్చిందన్నారు. అయినప్పటికీ సదరు వ్యాపార దుకాణాల తాళాలు పగులకొట్టి వేరే వ్యక్తులకు అద్దెకు ఇచ్చినట్లు ఆమె తెలిపారు. ఈ విషయమై తాము స్థానిక పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమ స్థలాన్ని అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని విజ్ఞప్తి చేశారు.

నేడు ఆరోగ్య అవగాహన సదస్సు

గన్నవరం: విమానాశ్రయం పక్కనే ఉన్న ఏబీ కన్వెన్షన్ సెంటర్‌లో గురువారం ఉదయం 9 గంటలకు ఆరోగ్య అవగాహన సదస్సు జరుగుతుందని ఆయుర్వేద వైద్యుడు డాక్టర్ రవివర్మ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. వ్యక్తి ఆరోగ్యమే సమాజ ఆరోగ్యంగా భావించి సదస్సుల ద్వారా ప్రజలను జాగృతి పరుస్తున్నట్లు పేర్కొన్నారు.

మహిళ కడుపులో 30 కిలోల కణితి తొలగింపు

పెనమలూరు: మండలంలోని కానూరులో ఉన్న అమెరికన్ ఆంకాలజీ ఇనిస్టిట్యూట్ (ఆస్పత్రి)లో ఓ మహిళకు అరుదైన శస్త్ర చికిత్స చేసి కడుపులో పెరిగిన 30 కిలోల కణితి తొలగించారు. సర్జికల్ అంకాలజిస్టు డాక్టర్ విజయ్‌కోడూరి, కన్సల్‌టెంట్ ఎనస్తీషియాలజిస్ట్ డాక్టర్ మృదుల ఆధ్వర్యంలో 64 ఏళ్ల మహిళకు శస్త్ర చికిత్స చేశారు. 30_20 సెంటీమీటర్ల పరిమాణం కలిగిన రెట్రో పెరిటోనియల్ మాస్‌ను లైపో సార్కోమా సర్జరీతో తొలగించారు. ఏఓఐ రీజినల్ సీఈఓ మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ తమ ఆస్పత్రిలో మల్టీ డిసిప్లినరీ టీమ్ నైపుణ్యంతో ఉత్తమమైన వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు.

స్కూల్ బస్సుల తనిఖీలు

ఉయ్యూరు: స్కూల్ బస్సులకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు తప్పనిసరి అని ఉయ్యూరు మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ సుబ్బారావు అన్నారు. రవాణా శాఖ ఆధ్వర్యంలో ఉయ్యూరు, పరిసర ప్రాంతాల్లో పాఠశాలలు, కళాశాలల బస్సులను బుధవారం తనిఖీ చేశారు. బస్సుల రికార్డులు, ఫిట్‌నెస్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంవీఐ సుబ్బారావు మాట్లాడుతూ పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలు నిబంధనలు పాటించాలన్నారు. విద్యార్థుల భద్రతే ప్రధానంగా బస్సులు నడపాలని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. తనిఖీల్లో ఏఎంవీఐ ఆయేషా పాల్గొన్నారు.

సీసీఆర్‌సీ కార్డులతో కౌలు రైతులకు మేలు

హనుమాన్‌జంక్షన్‌రూరల్: కౌలు రైతులు పంట సాగుదారు హక్కు పత్రం (సీసీఆర్‌సీ) తీసుకోవటం ద్వారా పలు ప్రయోజనాలు పొందవచ్చని మండల వ్యవసాయ అధికారి జొన్నలగడ్డ భవాని తెలిపారు. బాపులపాడు మండలంలోని ఓగిరాల, మల్లవల్లి గ్రామాల్లో కౌలురైతులకు సీసీఆర్‌సీ కార్డుల జారీపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. పంట సాగుదారు హక్కు పత్రం తీసుకోవటం వల్ల కౌలుదారులకు రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు, అపరాలు, వ్యవసాయ పనిముట్లు, ట్రాక్టర్లు, స్ప్రేయర్లు తీసుకునే అవకాశం ఉంటుందని ఏవో భవాని తెలిపారు. సీసీఆర్‌సీ కార్డు తీసుకున్న కౌలురైతు పేరిట ఈ-క్రాప్‌లో పంట నమోదు చేయటం ద్వారా ప్రకృతి వైపరీత్యాలు సంభవించి పంట నష్టం వాటిల్లితే పంటల బీమా, ప్రభుత్వ నష్ట పరిహారం, ఇన్‌పుట్ సబ్సిడీ వంటివి కౌలురైతుకు అందుతాయని చెప్పారు. సీసీఆర్‌సీ కార్డు, ఈ-క్రాప్ నమోదు ద్వారా మాత్రమే ధాన్యం కొనుగోలు కేంద్రంలో పంట విక్రయించేందుకు అస్కారం ఉంటుందని చెప్పారు.

కానూరులో ట్రక్ ఆటో చోరీ

పెనమలూరు: మండలంలోని కానూరులో ట్రక్ ఆటో చోరీకి గురైంది. ఈ ఘటనపై పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు క్రైమ్ పోలీసుల కథనం మేరకు.. కందుల ఏసుబాబు కానూరు మురళీనగర్‌లో నివసిస్తూ చేపల వ్యాపారం చేస్తున్నాడు. అతనికి ట్రక్ ఆటో ఉంది. ఏసుబాబు ఈ నెల 26వ తేదీన ట్రక్ ఆటోలో చేపలు తీసుకొచ్చి దిగుమతి చేశాడు. అనంతరం ఆటోను ఇంటి ముందు ఉంచాడు. మంగళవారం ఉదయం నిద్రలేచి చూసుకునే సరికి ట్రక్ ఆటో కనిపించలేదు. ఆటోను చోరీ చేశారని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

ఘనంగా ముగిసిన వారాహి నవరాత్రులు



ప్రత్యేక అలంకరణలో ఉత్సవమూర్తులు

గన్నవరం: స్థానిక పాతగన్నవరంలోని శ్రీలక్ష్మీతిరుపతమ్మ ఆలయంలో గత తొమ్మిది రోజులుగా జరుగుతున్న వారాహి నవరాత్రులు బుధవారం ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా అమ్మవారి సన్నిధిలో శ్రీలలితా సహస్రనామ పారాయణం, వారాహి అష్టోత్తర పూజలు జరిపారు. అనంతరం అమ్మవారికి అభిషేకాలు చేశారు. సంవృద్ధిగా వర్షాలు కురిసి ప్రజలు పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలంటూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారాహి నవరాత్రులను విజయవంతం చేసేందుకు సహకరించిన తిరుపతమ్మ మాతృ మండలి సభ్యులు, ఆలయ కమిటీకి అధ్యక్షుడు జాస్తి శ్రీధర్ కృతజ్ఞతలు తెలిపారు. జూలై 3న వ్యాసపూర్ణిమ సందర్భంగా అమ్మవారిని శాకంబరీదేవిగా పండ్లు, కూరగాయలు, ఆకుకూరలతో అలంకరించనున్నట్లు చెప్పారు.

రీ సర్వేతో భూ వివాదాలు పరిష్కారం



వణుకూరులో ప్రసంగిస్తున్న ఎంపీడీఓ సునీతాశర్మ

పెనమలూరు: మండలంలోని వణుకూరు గ్రామంలో చేపట్టనున్న వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూ రక్ష పథకం రీ సర్వేను సమర్థవంతంగా నిర్వహించాలని సంబంధిత అధికారులు, సిబ్బందిని ఎంపీడీఓ సునీతాశర్మ ఆదేశించారు. గ్రామంలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లకు భూరక్ష పథకం, జగనన్న సురక్ష కార్యక్రమంపై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రెవెన్యూ అధికారులు చేపట్టనున్న భూసర్వేకు గ్రామస్తులు సహకరించాలని ఎంపీడీఓ సూచించారు. భూములు రీ సర్వే చేయటం వల్ల భవిష్యత్తులో భూవివాదాలు రావని అన్నారు. జగనన్న సురక్ష పథకంలో భాగంగా వలంటీర్‌లు, సచివాలయాల సిబ్బంది ప్రతీ ఇంటికి వెళ్ళి సర్వే నిర్వహించాలని అన్నారు. గుర్తించిన సమస్యలు సత్వర పరిష్కారం చేయటానికి చర్యలు చేపట్టాలని తెలిపారు. ఈ సమావేశంలో తహసీల్దార్ కట్టా వెంకటశివయ్య, ఉప సర్పంచి గద్దల రాజా, వైఎస్సార్ సీపీ నేత చక్కా గోపీకృష్ణ పాల్గొన్నారు.

రీసర్వేకు అందరి సహకారం కావాలి

పెనమలూరు: వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూ రక్షణ పథకం కింద పోరంకిలో చేపట్టనున్న రీసర్వేకు అందరూ తమ వంతు సహకారం అందించాలని టిడ్కో డైరెక్టర్ పి.రాఘవరావు కోరారు. పోరంకిలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. గతంలో ఎన్నడూ జరగని విధంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం భూసర్వే చేపట్టిందన్నారు. దీని వలన చాలా కాలంగా ఉన్న భూ వివాదాలు పరిష్కారమవుతాయని తెలిపారు. భూ యజమానులు వారి వద్ద ఉన్న డాక్యుమెంట్లు ఆధారంగా సర్వే చేయించుకుని భూ సమస్యలను అధిగమించాలని సూచించారు. పోరంకిలో 2,200 మంది రైతులకు సంబంధించి 2,800 ఎకరాలు రీసర్వే చేస్తారని వివరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటశివయ్య, మునిసిపల్ కమిషనర్ ఎస్.ప్రకాశరావు, వైఎస్సార్ సీపీ నేతలు అద్దేపల్లి చందు, చుండూరు శేఖర్‌బాబు, సర్వేయర్లు పాల్గొన్నారు.

మునిసిపల్ కార్మికుల ర్యాలీ

పెనమలూరు: వచ్చే నెల పదో తేదీ నుంచి సమ్మె చేపట్టనున్న తాడిగడప మునిసిపల్ కార్మికులు బుధవారం పోరంకిలో ర్యాలీ నిర్వహించారు. సీఐటీయూ మండల ఉపాధ్యక్షుడు షేక్ మస్తాన్‌వలి మాట్లాడుతూ.. కార్మికుల సమస్యలపై మునిసిపల్ కమిషనర్ తక్షణం స్పందించాని కోరారు. కార్మికుల సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ర్యాలీలో నాయకులు ఉప్పాడ త్రిమూర్తి, లక్ష్మీ ప్రసన్న, యనమల సరళ, ఎం.ఏడుకొండలు, నరసయ్య, ఇందిర పాల్గొన్నారు.

ఉప్పాలకు ఘన నివాళి



రాంప్రసాద్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ఉయ్యూరు: నిబద్ధతత కలిగిన రాజకీయ నాయకుడు ఉప్పాల రాంప్రసాద్ అని పలువురు వక్తలు కొనియాడారు. ఉయ్యూరులోని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజులపాటి రామచంద్రరావు కార్యాలయంలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఉప్పాల రాం ప్రసాద్ సంస్మరణ కార్యక్రమం బుధవారం జరిగింది. ఉప్పాల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బడుగు, బలహీన వర్గాలు, వైఎస్సార్ సీపీ పటిష్టతకు ఉప్పాల చేసిన కృషి ఎనలేనిదని నాయకులు పేర్కొన్నారు. బీఎస్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు జంపాన శ్రీనివాసగౌడ్, కౌన్సిలర్లు రాజులపాటి చిన్ని, డాక్టర్ జంపాన పూర్ణిమ, గురజాడ పీఏసీఎస్ చైర్మన్ బొర్రా చిన్నబాబు, నాయకులు పడమట భువనేశ్వరి, ఆరేపల్లి నాగమల్లేశ్వరి, ఏఎంసీ డైరెక్టర్ ఆరేపల్లి నాగరాజు, మురాల అయ్యా తదితరులు పాల్గొన్నారు.

మోనోపోల్ విద్యుత్ టవర్ల నిర్మాణం

నున్న(విజయవాడరూరల్): నున్న 220 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి గుణదలకు సరఫరా చేసే విద్యుత్ మోనోపోల్ విద్యుత్ టవర్ల నిర్మాణం పనులు నున్న-గుణదల రోడ్డులో జరుగుతున్నాయి. నున్న 220 సబ్‌స్టేషన్ నుంచి గుణదల సబ్‌స్టేషన్ వరకు మోనోపోల్స్ విద్యుత్ టవర్స్ లైన్లు నిర్మిస్తున్నారు. అక్కడ నుంచి విజయవాడ, పరిసర ప్రాంతాలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు మోనోపోల్ టవర్స్‌ను నిర్మిస్తున్నట్టు ఏపీ ట్రాన్స్‌కో అధికారులు తెలిపారు. గతంలో నిర్మించిన టవర్ల విద్యుత్ లైన్లు కిందికి దిగిపోవడం, అనుకోని విధంగా ప్రమాదాలు జరిగే అవకాశాలున్నందున వాటి స్థానంలో మోనోపోల్ విద్యుత్ టవర్లను నిర్మిస్తున్నారు. ఈ పనులు జరుగుతున్నందున నున్న-గుణదల రోడ్డులో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ట్రాఫిక్ పోలీసులు బారికేడ్లను ఏర్పాటు చేసి వాహనాలు రాకుండా చూస్తున్నారు.

కొబ్బరి చిప్పల వేలం ఆదాయం రూ.79,500

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడులోని శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో నిర్వహించిన కొబ్బరి చిప్పల వేలం పాటలో రూ.79,500 ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి పి.లోకేశ్వరి తెలిపారు. ఆలయ ప్రాంగణంలో అమ్మవార్లకు భక్తులు సమర్పించిన కొబ్బరి చిప్పలను రెండు సంవత్సరాల కాలపరిమితికి బుధవారం టెండర్, బహిరంగ వేలంపాట నిర్వహించారు. గ్రామంలోని హనుమాన్‌నగర్‌కు చెందిన ఆకుల శ్రీను హెచ్చుపాట పాడి టెండర్ దక్కించుకున్నారని ఈఓ తెలిపారు. నిబంధనల ప్రకారం రెండవ సంవత్సరానికి 10 శాతం అదనంగా అనగా రూ.87,450 చెల్లించవలసి ఉంటుందన్నారు.

పోరంకి సొసైటీ చైర్మన్‌కు సన్మానం



పెనమలూరు: మండలంలోని పోరంకి సొసైటీలో 100 శాతం రుణాలు వసూలు చేసినందుకు సొసైటీ చైర్మన్ మంచినేని పరమేష్, సీసీఓ జి.పద్మజను బుధవారం ఘనంగా సన్మానించారు. మచిలీపట్నంలో కృష్ణా జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ మహా జనసభ బుధవారం జరిగింది. ఈ సభలో పోరంకి సొసైటీ సకాలంలో ఇచ్చిన రుణాలు 100 శాతం వసూళ్లు చేసినందుకు పోరంకి సొసైటీ చైర్మన్ మంచినేని పరమేష్, సీసీఓ జి.పద్మజను, కార్యవర్గ సభ్యులను కేడీసీసీ బ్యాంకు చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు ఘనంగా సన్మానించి జ్ఞాపికలు బహూకరించారు. సొసైటీ పరిధిలోని రైతుల సహకారంతో ఈ ఘనత సాధించామని, సొసైటీ సేవలు మరింత విస్తృతం చేస్తామని మంచినేని పరమేష్ తెలిపారు.

నేల రకాన్ని బట్టి విత్తనాలు ఎంపిక చేసుకోవాలి

ఉంగుటూరు: నేల రకం బట్టి విత్తనాలు ఎంపిక చేసుకుంటే అధిక దిగుబడులను పొందవచ్చని వ్యవసాయ అధికారి హరీష్‌కుమార్ అన్నారు. వేంపాడు గ్రామంలో పొలంబడి కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ నారుపోసే ముందు విత్తన శుద్ధి తప్పనిసరిగా చేయాలని సూచించారు. రైతులతో ముఖాముఖీగా మాట్లాడి సమస్యలను తెలుసుకుని పంటల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించేందుకు ప్రభుత్వం పొలంబడి నిర్వహిస్తుందని చెప్పారు. రసాయనిక ఎరువులు తగ్గించి సేంద్రియ వ్యవసాయం వైపు రైతులు దృష్టి సారించాలన్నారు. అనంతరం నారుమడులు వేసే ముందు తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈవో దుర్గా నాగేశ్వరరావు, వీఏఏలు, పలువురు రైతులు పాల్గొన్నారు.